డెంగీపై అవగాహన అవసరం : డిఎంహెచ్ఒ

కడప అర్బన్ : డెంగీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటుచేసిన సదస్సులో మాట్లాడారు. 'సమాజ భాగస్వామ్యంతో డెంగు అరికట్టవచ్చు' అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఫ్రైడే డ్రైడే సమర్థవంతంగా చేపట్టాలని పేర్కొన్నారు. వ్యక్టర్ కంట్రోల్ అండ్ హైజినిక్ యాప్‌లో ఎఎన్ఎంలు అప్లోడ్ చేయాలని కోరారు. చెత్త కుప్పలు, నీటితో నిండిన చిన్న చిన్న నీటి గుంతలను మట్టితో మూసివేయాలని, ఎఎన్ఎంలు అప్లోడ్ చేసిన ఈ కార్యక్రమాలను ఎప్పటికప్పుడూ పిఆర్ఒ, డిపిఒ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిఎల్ పిఒ మస్తాన్ వల్లి, రిమ్స్ మైక్రో బయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. నాగ సుధా, ఎంహెచ్ఒ డాక్టర్. చంద్రశేఖర్, డిఎంఒ మనోరమ, ఎస్ఒ. రమేష్ రెడ్డి, ఎఎంఒ. వెంకటరెడ్డి, పి. రామ సుబ్బారెడ్డి, రాఘవ, సబ్ యూనిట్ ఆఫీసర్స్, డీప్యూటీ డెమో డి.రమణమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర, రిమ్స్ పీజీ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

బెట్టింగుల జోరు

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు జోరందుకున్నాయి. కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పందేలు కాస్తుండడం పతాక స్థాయికి చేరుకుంది. ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపోటములు, ప్రభుత్వ మార్పు, పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాధించబోయే మెజార్టీలపై పందెం రాయుళ్లు బెట్టింగులు కాస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది. ఉభయ జిల్లాల వ్యాప్తంగా బెట్టింగుల రూపంలో కోట్లాది రూపాయలు చేతులు మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

- అభ్యర్థుల గెలుపోటములపై పందేలు
- పులివెందుల మెజార్టీపై ఫోకస్
- కమలాపురం, ప్రొద్దుటూరులో పోటాపోటీ
- రాజంపేట, రాయచోటి అసెంబ్లీల్లోనూ రూ.కోట్లు చేతులు మారుతున్న వైనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో బెట్టింగులజోరు కొనసాగుతోంది. కడప పార్లమెంట్ పరిధిలోని ఏడు, రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. కడప జిల్లాలోని కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాజంపేట, రాయచోటి నియోజకవర్గ బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములపై పందేలు పెద్దఎత్తున పందేలు కాస్తున్నారు. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు అసెంబ్లీ అభ్యర్థుల విజయావకాశాలపై రూ.లక్ష చొప్పున పందేలు కాస్తున్నారు. కడప అసెంబ్లీ అభ్యర్థుల విజయావకాశాలపై ఎన్నికల ప్రచారాల సమయంలోనే పందేలు కాయడం తెలిసిందే. జిల్లాలోని గట్టి పోటీ నెలకొన్న కమలాపురం, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో పెద్దఎత్తున పందేలు కాస్తుండడం చర్చనీయాంశంగా మారింది. రాయచోటి అసెంబ్లీ పరిధిలోని ఓ మండలంలో రూ.10 లక్షల చొప్పున పందేలకు దిగారు. పోలింగ్ అనంతరం ఓటింగ్ సరళి, మహిళలు, వృద్ధులు పెద్దఎత్తున పోటెత్తిన నేపథ్యంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు ప్రతిపక్ష టిడిపికి పడే అవకాశం ఉందని, అధికార వైసిపి వృద్ధులు, మహిళలకు అందించిన సంక్షేమ పథకాల కారణంగా పాజిటివ్ ఓటు పడిందని అంచనాలతో పెద్దఎత్తున పందేలు కాస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

జగన్ మెజార్టీపైనా బెట్టింగులు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పులివెందుల నియోజకవర్గంలో సాధించబోయే మెజార్టీపైనా పెద్దఎత్తున పందేలు కాస్తుండడం గమనార్హం. కుప్పంలో నారా చంద్రబాబునాయుడు, పిఠాపురంలో పవన్‌కల్యాణ్, మంగళగిరిలో నారా లోకేష్ మెజార్టీలపై బెట్టింగులు కాస్తున్నారు. రాయలసీమ, ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా ప్రాంతాలకు చెందిన పలు అసెంబ్లీల తరుపున బరిలో నిలిచిన ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపోటములపై పందేలకు సిద్ధ పడుతున్నారు. సదరు అభ్యర్థులు సాధించబోయే మెజార్టీలను, పులివెందుల మెజార్టీతో పోల్చి కోట్లాది రూపాయలతో కూడిన బెట్టింగులకు పాల్పడడం మూర్ఖత్వమా లేక తెంపరితనమా అనేది తెలియడం లేదని చెప్పవచ్చు. కడప పార్లమెంట్ వైసిపి అభ్యర్థి అవినాష్‌రెడ్డి గెలుపోటములపై వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అనుకూలురు ఎవరు బెట్టింగులకు పాల్పడకపోవడం విశేషంగా చెప్పుకోవచ్చు.

ప్రభుత్వ మార్పుపైనా పందేలు

జిల్లాల్లోని అసెంబ్లీ అభ్యర్థుల గెలుపోటములపై పందేలు కాయడం వరకు బాగానే ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం మార్పుపైనా పెద్దఎత్తున పందేలు కాస్తుండడం గమనార్హం. ఒక్కొక్కరు పరస్పరం రూ.లక్షకు రూ.లక్షన్నర చొప్పున పందేలు కాస్తుడడం ఆసక్తిని కలిగిస్తోంది. ప్రతిపక్ష టిడిపి అనుకూలురు ప్రభుత్వం మారుతుందనే పేరుతో రూ.లక్ష పెడితే ప్రత్యర్థులు రూ.లక్షన్నర పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన ఉభయ జిల్లాల వ్యాప్తంగా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. కడప, రాజంపేట అసెంబ్లీల్లో ఏ పార్టీ అభ్యర్థులు గెలుస్తారో ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే గుడ్డి అంచనాలతో పందేలకు దిగుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది. ఈలెక్కన జూన్ నాలుగవ తేదీ కౌంటింగ్ సమయానికి ఎందరు ఆస్తులను పోగొట్టుకుని, అప్పుల పాలవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్‌లో జరగబోయే పరిణామాన్ని ఊహించి వర్తమానంలో పందేలు కాస్తుండడం వెర్రితనమనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టిడిపిలో వెన్నుపోట్లు!

- కడప, కమలాపురం అసమ్మతులపై ఆరోపణలు
- అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక
- గుంభనంగా అసమ్మతి నేతలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రతిపక్ష టిడిపి అభ్యర్థులకు వెన్నుపోట్లు తప్పలేదు. జిల్లాలోని కడప, కమలాపురం నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులకు పార్టీకి చెందిన కొందరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆరోపణలు చేయడం గమనార్హం. పోలింగ్ ముందు అసమ్మతి నేతలందరూ కలిసికట్టుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇంతలోనే ఏంజరిగిందో అభ్యర్థికి, అసమ్మతి నాయకులకు తెలియాలి. పోలింగ్ ముగిసిన మరుసటి రోజే వెన్నుపోటు పొడిచారనే ఆరోపణలు చేయడం, వెన్నుపోటుదారులపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఎవరిని ఉద్దేశించి వ్యాఖ్యానించారో తెలియని అసమ్మతి నేతలు సైతం గుంభనంగా వ్యవహరించడం గమనార్హం. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసులరెడ్డి నర్మగర్భ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వీరితో ఎన్నికల నోటిఫికేషన్ దగ్గర నుంచి కలవని నేతలను ఉద్దేశించి చేశారా లేక ఎవరిని ఉద్దేశించి చేశారో తెలియడం లేదు. ఆ మరుసటిరోజే కమలాపురం అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి నేరుగా ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. పార్టీలో ఉంటూనే కోగటంలోని తమ ఏజెంట్లను హెచ్చరించడం, బెదిరించడం వంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడమేమిటని విమర్శించడం గమనార్హం. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ అభ్యర్థుల ఆరోపణలపై అసమ్మతి నేతల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం గమనార్హం.

విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిజిఎం గురవయ్య

హాజరైన విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది

- విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు చర్యలు
- ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య

ప్రజాశక్తి - కడప

నిర్దేశించిన కాల వ్యవధిలో కొత్త సర్వీసులు విడుదల చేయాలని, లేకపోతే సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని, అలాగే పేరు కుపోయిన విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య పేర్కొన్నారు. గురువారం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ ఆధ్వర్యంలో కడప విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి వైఎస్ఆర్‌జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిజిఎం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల లైన్లు తెగిపడే ప్రమాదాలున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వినియోగదారుడు 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసిన 48 గంటలలో గ్రామీణ ప్రాంతాలలో, 24 గంటలలో పట్టణ ప్రాంతాలలో కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లను మార్చాలని పేర్కొన్నారు. రైతులను వ్యయప్రాసలకు గురి చేయకుండా కాలి పోయిన ట్రాన్స్ ఫార్మర్లను మార్చేందుకు అవసరమైన మరమ్మతులు చేసి వాటిని సంస్థ వాహనాల ద్వారా వినియోగదారుని వద్దకు తీసుకెళ్లి కాలిపోయిన స్థానంలో మార్చాలని ఆదేశించారు. జిల్లాలో ట్రాన్స్ ఫార్మర్ల వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, ఫలితంగా కోట్ల రూపాయల ఖర్చు వస్తుందని, ఇది అదనపు ఖర్చు అని తెలిపారు. విధిగా వాటి నిర్వహణ చేసుకుంటూ సంస్థకు నష్టం వాటిల్లకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలని అరికట్టాలన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని పేర్కొన్నారు. అంత రాయాలు అధికంగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అరికట్టాలని సూచించారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాలని తెలిపారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు సాయంత్రం, తెల్లవారు జాము సమయాలలో దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారునితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించి సంస్థపై ప్రజలలో సంతృప్తికరస్థాయిని పెంచాలని తెలియజేశారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో నిర్వాహకులు, అర్చకులు

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331 ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడవ రోజు గురువారం ఉదయం సుప్రభాతం, నామ సంకీర్తన, అభిషేకాలతో ప్రారంభమయ్యాయి. శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవంపై అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. ఆరాధన ప్రత్యేక అధికారి యధుభుషన్ రెడ్డి, బద్వేల్ ఆర్‌డిఒ ఆకుల వెంకట రమణ, పిట్ పర్సన్ శంకర్ బాలాజీ భక్తుల వసతులను పర్యవేక్షించారు. అనంతరం స్వామి వారి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి నరణంది ఉత్సవంపై వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం హరి కథా కాలక్షేపం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి, శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య చారి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులు

- టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య

ప్రజాశక్తి - కడప

ఓటమి భయంతోనే వైసిపి నాయకులపై టిడిపి నేతలు దాడులకు పాల్పడుతున్నారని టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య అన్నారు. వైసిపి నాయకులపై టిడిపి నాయకులు దాడులు చేస్తుంటే పోలీస్ వ్యవస్థ నిద్రపోతుందా అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ చంద్రబాబు తొత్తుగా మారిందన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులపై దాడులకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సాధారణ ఎన్నికల తరువాత టిడిపి నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పైన వైసిపికి ఓట్లు వేశారని, ఏజెంట్లుగా కూర్చున్నారని, వైసిపికి సపోర్ట్ చేశారని రాష్ట్రవ్యాప్తంగా దాడులు టిడిపి నాయకులు చేయడాన్ని తీవ్రంగా బిసి సంఘాలుగా తాము ఖండిస్తున్నామన్నారు. మన జిల్లాలో ముఖ్యంగా ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా రాత్రి రాయచోటిలో నాయి బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు ఇంటిపైకి 70 మందిని పంపించి ఇళ్లు పగలగొట్టి ధ్వంసం చేసి దాడికి పాల్పడడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాయచోటిలో నిలబడ్డ టిడిపి అభ్యర్థి మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేయడమే కాకుండా నానా దుర్భాషలు ఆడడం హేయమైన చర్య అన్నారు. చిన్న కులాలు అంటే అంత అలుసా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులకు టిడిపి నాయకులు పాల్పడు తున్నారంటే అది కేవలం ఓడిపోతామన్న భయంతోనే అన్నారు. అధికారంలోకి రాకముందే, ఎన్నికల ప్రక్రియ అయిపోకముందే ఇంత దారుణమైన పరిస్థితి ఉంటే, ఒకవేళ టిడిపి అధికారంలోకి వస్తే చిన్న కులాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీలు బతికే పరిస్థితి ఉందా? అన్నారు. దాడులకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాయచోటి టిడిపి అభ్యర్థిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం సాగిస్తామని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

19న 'పుచ్చలపల్లి' వర్ధంతి సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ ఈనెల 19 న ఉదయం 10 గంటలకు కడప పాత బస్టాండ్ లో ఉన్న సిపిఎం కార్యాలయంలో ఉంటుందని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్, నగర కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1917, మే 1న జన్మించిన సుందరయ్య తన జీవితాన్ని పేదలకు, కష్టజీవులకు అంకితం చేశారన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారథుల్లో సుందరయ్య ఒకరిని పేర్కొన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. చిన్న వయసులోనే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. క్రమశిక్షణ, త్యాగనిరతి, అధ్యయనం, ఆచరణ, నిర్మాణ దక్షత ఆయన సొంతమన్నారు. నేటి పరిస్థితుల్లో సుందరయ్య స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తప్పకుండా హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి పౌరుడూ సమాజానికి ఉపయోగపడాలి

కలసపాడు : ప్రతి పౌరుడూ సమాజానికి ఉపయోగపడాలని పోరుమామిళ్ల డీఎ పేర్కొన్నారు. గురువారం స్థానిక చర్చిలో జిల్లా పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ముండ్లపాటి ప్రసాదరావు ఆధ్వర్యంలో యువతకు సదస్సు నిర్వహించారు. అనంతరం లాయర్ మనోహర్ మాట్లాడుతూ వివాహ తర్ఫీదులో ఉన్న విషయాలను క్షుణ్ణంగా అర్థమయ్యే విధంగా యువతీ యువకులకు తెలియజేశారు. అందులో చట్టాల గురించి వివరించారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి యువకుడూ 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలని తెలిపారు. అప్పుడే ఇరువురు ఒకరినొకరు అర్థం చేసుకుని కుటుంబ జీవితాన్ని కొనసాగిస్తారని తెలిపారు. అనంతరం వివాహ తర్ఫీదుకు వచ్చిన యువతీ యువకులకు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య మాత సిస్టర్స్, పి. నిర్మల, ప్రశాంతి, అరుణ్ స్వామి, రాజేంద్ర పాల్గొన్నారు.

రైతులకు అందని విత్తనాలు

బి.కోడూరు : మండలంలో పది రోజుల నుంచి రెండు సార్లు వడగండ్లతో కూడిన వర్షం పడినందున రైతులకు కొంత మేరకు సాగుకు ఊరట లభించింది. రబీ సీజన్ మొదలవడంతో రైతులు తొలి సాగు కోసం వేచి ఉన్నారు. పచ్చిరొట్ట, జొన్న విత్తనాలు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయాధికారి స్పందించి ప్రతి రైతు కేంద్రానికి కానీ, మండల హెడ్ క్వార్టర్ వ్యవసాయ అధికారుల వద్ద కానీ పచ్చి రొట్టె విత్తనాలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వారం తరువాత ప్రభుత్వం నుంచి విత్తనాలు మంజూరైన వెంటనే సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి

కడప : వర్షాలు సకాలంలో కురవాలంటే ప్రకృతిని కాపాడుకోవాలని, మొక్కలు నాటి ప్రకృతిని సంరక్షించుకోవాలని పాస్టర్ పి. మహేష్ సూచించారు. గురువారం కడప నగరం బిల్డప్ సమీపంలోని కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవళితో పాటు సకల జీవరాశులు జీవించాలంటే వర్షాలు కురవాలన్నారు. అప్పుడే భూమిపైన రైతులు పంటలు పండిస్తారని, తాగడానికి నీరు సమృద్ధిగా ఉంటుందని అన్నారు. ఈ సంవత్సరం ఎండలు మరీ ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దీనికి ఉపశమనంగా సకాలంలో వర్షాలు కురిపించాలని, కరువు కాటకాలు రాకూడదని అందుకు అనుగుణంగా ప్రకృతిని కాపాడుకొని మొక్కలు నాటాలని కోరారు.

స్ట్రాంగ్ రూమును తనిఖీ చేసిన ఎస్‌పి



స్ట్రాంగ్ రూములో రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఎస్‌పి సిద్ధార్థ్‌కౌశల్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను బుధవారం అర్ధరాత్రి ఎస్‌పి సిద్దార్ధ్ కౌశల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 24 X 7 గంటల నిరంతరంగా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు, నిఘా కెమెరాలతో పర్యవేక్షణలో ఉండాలని అక్కడి సిబ్బందికి తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఇవిఎం బాక్స్‌లను జిల్లా కేంద్రంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో తరలించారు. భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రతను కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్క సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరైనా హింసాత్మకమైన ఘటనలకు పాల్పడిన, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కడా నలుగురు అంతకు మించి గుంపులు, గుంపులుగా ఉండకూడదని చెప్పారు. అనుమతులు లేకుండా ఎక్కడ సభలు, ప్రచారాలు నిర్వహించకూడదన్నారు. ఎవరైనా అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌పితోపాటు అడిషనల్ ఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఎ.ఆర్ డిఎస్‌పి మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

జై వీరబ్రహ్మ జై!! గోవిందమాంబ జై!!

శాశ్వత నిత్య అన్నదాన పథకము

దానములలోకెల్ల గొప్పది అన్నదానము



జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి సజీవ సమాధి ప్రాంగణంలో మఠాధిపతుల పర్యవేక్షణలో తేది.01.01.2001 నుండి ప్రారంభమై నిత్య అన్నదానము నిర్విరామముగా జరుగుచున్నది. దాతలు విరివిగా విరాళములు పంపి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము.

దివంగత మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరభోగవసంత వేంకటేశ్వరస్వాముల వారు

దాతలు రూ.2,116-00 పైన ఇచ్చు విరాళములను బ్యాంక్‌లో భద్రపరచి వచ్చు వడ్డీతో అన్నదానము జరుపబడును. అన్నదాతలు విరాళాములు మనిఆర్డర్స్ ద్వారా లేదా యస్.బి.ఐ./యూనియన్ బ్యాంక్/ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, బ్రహ్మంగారిమఠం మీద డి.డి.ల/ ఆన్‌లైన్ రూపంలో పంపవచ్చును. దాతలు ధాన్య వస్తువుల రూపముగా సమర్పించదలచిన మఠము కార్యాలయమునందు సమర్పించగలరని మనవి చేయుచున్నాము.

గమనిక : దాతలు విరాళములకు నిత్య అన్నదానమునకు డి.డి.ల రూపంలో మరియు ఆన్‌లైన్ రూపంలో పంపవచ్చును.
S.B.I.A/C No:. 30830570574, I.F.S.C.Code:- SBIN 0012672 Brahmamgarimattam
A.P.G.B.A/C No. 19129009930, I.F.S.C.Code:- APGB 0002033 Brahmamgarimattam
UNION BANK. A/C No.286110100004146, I.F.S.C.Code:- UBIN 0828611 (Somireddypalli) Brahmamgarimattam

ఇట్లు: ఫిట్‌పర్సన్/ మేనేజరు
జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారు మఠం.
కందిమల్లాయపల్లె - 516503. కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దోమలతో డెంగీ వ్యాధి వ్యాప్తి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమల వల్ల డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వైద్య సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ డెంగీ వ్యాధి వైరస్ ద్వారా సంభవిస్తుందన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ వ్యాధి నియంత్రణ మన చేతుల్లో ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉన్న పాత్రలను, తొట్టెలను, పాత టైర్లను, వేస్ట్ ప్లాస్టిక్ గ్లాసుల్లో నీరు నిల్వ లేకుండా చేయడం దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. నీటి నిల్వలో టైగర్ దోమ పెరిగి దాదాపు 400 గుడ్లు పెడుతుందని సిద్ధయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో అరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యవర్గ నియామకంలో రాజా మాదిగ

అధికారంలో ఉన్న పార్టీ వర్గీకరణకు కట్టుబడాలి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వర్గీకరణకు కట్టుబడి ఉండాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్‌యన్ రాజా మాదిగ తెలిపారు. స్థానిక సంజీవ్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నరసింహ, చెన్నమ్మ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు డివిజన్ నూతన కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఇరు పార్టీలకు మాదిగలు ఓట్లు వేశారని ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన మాదిగల ఓట్లతోనే అధికారంలోకి వస్తారన్నారు. వచ్చాక మాదిగలకిచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఈ నాయకులకు ఉందన్నారు. జూన్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోయే పార్టీ మాదిగలను మోసం చేస్తే ఆ తర్వాత ఆ పార్టీకి రాజకీయ భవిష్యత్తు లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మాదిగలు ఏకమవుతారని తెలిపారు.

విభిన్నప్రతిభావంతులకు సరుకులు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శ్రీనివాస థియేటర్‌లో ఉన్న కిరాణా మర్చంట్ ఏకాశి మహేష్‌బాబు కుమారుడు ఏకాశి ఇషాంత్ లతాక్షర్ మొదటి జన్మదిన సందర్భంగా గురువారం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుని జన్మదినం విభిన్నప్రతిభావంతుల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా బాబు జన్మదిన సందర్భంగా వీరికి తమ వంతు చేయూతనందిస్తామని తల్లిదండ్రులు మహేష్ బాబు, చిరు మౌనిక పేర్కొన్నారు. అనంతరం తన మనవడు ఇషాంత్ జన్మదిన సందర్భంగా అమ్మ సేవా సమితి అధ్యక్షుడు పూల రమేష్ బాబు విభిన్న ప్రతిభావంతులకు ఆర్థికసాయం అందించారు. మహేష్ కుటుంబ సభ్యులను విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ తరపున రఘునాథరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుజాత, లక్ష్మీదేవి, చరణ్, అరుణ్, అనిల్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు ఇస్తున్న దాతలు

చిక్కిపోయిన 'అంగన్వాడీ' గుడ్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న గుడ్లు మరీ చిక్కిపోయిన ఉన్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్నాయి. గుడ్లు, బాలామృతం, చిక్కీలు, ఖర్జురాలు, బెల్లం అచ్చులు, పాలు, బియ్యం, కంది బేడలు, నూనె అందిస్తుంది. ఇందులో ముఖ్యంగా రోజూ గుడ్లు తినడం, పాలు తాగడం వల్ల గర్భిణులు, శిశువుకు పౌష్టికాహారం లభిస్తుంది. గుడ్లు సరఫరా చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చింది. ఆ కాంట్రాక్టర్ ద్వారా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేస్తుంది. కాంట్రాక్టర్ సరఫరా చేసే గుడ్లు సైజు తక్కువ మోతాదులో చాలా చిన్నగా ఉన్నాయి. రెండు గుడ్లు కలిపితే ఒక గుడ్డు సైజులో ఉన్నాయని తల్లులు అంటున్నారు. గుడ్లు ఉడకబెడితే రబ్బరు లాగా గట్టిగా ఉంటున్నాయని, నాణ్యత లేవని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పౌష్టికాహారం ఎలా లభిస్తుందని తల్లులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ నాణ్యమైన గుడ్లు తగిన మోతాదులో అందించేలా చూడాలని గర్భిణులు, తల్లులు, పిల్లలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న గుడ్లు

బిపి అదుపునకు క్రమశిక్షణాయుత జీవనశైలి ముఖ్యం

నేడు రక్తపోటు దినోత్సవం సందర్భంగా : ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్.రవిచంద్రారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

క్రమశిక్షణాయుత జీవనశైలితో బిపి (రక్తపోటు)ని అదుపులో పెట్టవచ్చని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్.రవిచంద్రారెడ్డి తెలిపారు. క్రమశిక్షణగల జీవితాన్ని గడుపుతూ మానసికవత్తిడి దూరంగా ఉంటే బిపిని అదుపులో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. శుక్రవారం రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. బిపిలో ప్రైమరీ హైటెన్షన్, సెకండరీ హైటెన్షన్ అను రెండు రకాలున్నాయి. హై బిపి రక్త నాళాలను, గుండెని త్వరగా దెబ్బ తీస్తుందన్నారు. వీటిని నియంత్రించలేకపోతే గుండె సమస్యలు, పక్షవాతం, మూత్రపిండాలు దెబ్బతినడం వంటి ఇతర తీవ్రమైన గుండె సమస్యలకు దారి తీయవచ్చన్నారు. 50 ఏళ్ల దాటిన వారికి ఎలాంటి కారణాలు లేకుండా కూడా 90శాతం బిపి వచ్చే అవకాశం ఉందన్నారు. సెకండరీ హై టెన్షన్‌కు కారణాలుంటాయని, ఇది పిల్లలకు కూడా రావచ్చన్నారు. మద్యపానం, ధూమపానం, మానసిక వత్తిడి, ఊబకాయం, సరైన వ్యాయామం లేకపోవడం వల్ల వస్తుందన్నారు. ఇది మెదడుపై ప్రభావం చూపి పక్షవాతం వచ్చే అవకాశం ఉందన్నారు. కంటిచూపు దెబ్బ తింటుందన్నారు. గుండె జబ్బులకు దారి తీస్తుందన్నారు. ఇవి బిపి వల్ల కలిగే నష్టాలుగా వివరించారు. మానసిక వత్తిడికి దూరంగా ఉండాలన్నారు. ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. వారానికి 150 నిమిషాలు శరీరం చెమట పట్టేలా నడవాలన్నారు. ఆహార నియమాలు పాటించాలన్నారు. రోజుకు రెండు నుండి మూడున్నర గ్రాముల వరకు మాత్రమే ఉప్పు వాడాలన్నారు. నూనె వస్తువులు, జింక్ పదార్థాలు దూరంగా ఉంచాలన్నారు. నెలనెలా బిపిని పరీక్ష చేయించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడాలని సూచించారు. బిపిని పర్యాయపదంగా సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారన్నారు. సక్రమమైన జీవనశైలి ద్వారా బిపిని అదుపులో ఉంచుకోవచ్చని డాక్టర్ రవిచంద్రారెడ్డి వివరించారు.

క్షయ వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

వ్యాక్సినేషన్ వేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలించడానికి 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ క్షయ వ్యాధి రాకుండా అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించామని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం రాధాకృష్ణ నగర్‌లోని యుపిహెచ్‌సిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 645 సచివాలయాలలో టీకాల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఐదు సంవత్సరాలలో టీబీ వచ్చి తగ్గిపోయినవారు, టీబీ రోగులతో సన్నిహిత సంబంధం కలిగిన వారు, 60 సంవత్సరాలు పైబడిన వారు, మధుమేహం కలిగిన వారు, పొగ తాగేవారు, 18 కిలోల కంటే తక్కువ బరువు ఉన్నవారు బిసిజి టీకా వేయించుకోవాలని చెప్పారు. టీకా ద్వారా ఎటువంటి దుష్పరిణామాలు ఉండవని తెలిపారు. అపోహలు వీడి అర్హులైన ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, హెచ్ఐవి వ్యాధితో ఉన్నవారు, ఏ వ్యాధితో అయినా బాధపడుతున్న వారు టీకా తీసుకునేందుకు అర్హులు కాదని చెప్పారు. కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి, డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డిఎల్ఎటిఒ డాక్టర్ రవిబాబు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉబేదుల్లా, ఆర్‌కె నగర్ యుపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుమధుర, ఎస్ ఓ రమేష్ రెడ్డి, సిహెచ్‌ఒ మునిరెడ్డి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : క్షేత్రస్థాయిలో వైద్యశాఖ సిబ్బంది గుర్తించిన ప్రతి ఒక్క క్షయ వ్యాధి రోగి తప్పక టీకా (వ్యాక్సినేషన్) వేయించుకోవాలని బిదనంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ఈవో సుకుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పైడిపాలెం, గురిజాల సచివాలయాల పరిధిలో బిసిజి వ్యాక్సినేషన్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించేందుకు ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రమాదేవి, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

చాపాడు : రాష్ట్రంలో 2025 నాటికి టిబి కేసుల నిర్మూలనే లక్ష్యంగా బాసిల్లస్ కాల్ మెంట్ గేర్విన్ (బిసిజి) వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. గుంత చియ్యపాడులో గురువారం ప్రారంభించారు. ఎలాంటి అపోహలు లేకుండా టీకాలు సిబ్బంది సూచించిన ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, రమేష్, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

వేంపల్లె : క్షయ వ్యాధి నివారణకు బిసిజి వ్యాక్సినేషన్ చేపట్టినట్లు ప్రభుత్వ వైద్యాధికారి స్వాతిసాయి చెప్పారు. గురువారం తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 8వ సచివాలయం పరిధిలో ఉన్న రాజీవ్ కాలనీలో అడ్బల్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రారభించారు. కార్యక్రమంలో డాక్టర్ నిజాముద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, సూపర్‌వైజర్స్, సిహెచ్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి గురువారం టీకా వేస్తామని వైద్యులు తెలిపారు. 'వయోజన బిసిజి టీకా' కార్యక్రమాన్ని గురువారం స్థానిక బాపూజీ నగర్, కెహెచ్ఎం వీధి సచివాలయంలో అర్బన్ వైద్యాధికారి డాక్టర్ శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **టిబి రోడ్డులోని సచివాలయాల్లో..** ఎపిహెచ్‌సి టిబి రోడ్డులోని ఆరు సచివాలయాల్లో క్షయవ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యలో మొదటి విడతలో భాగంగా బిసిజి టీకా వేశారు. వైద్యాధికారి నల్లబల్లి హిమబిందు, టి.బి.సూపర్వైజర్ బి.రాజారత్నం రాజు, సిఎంఒ సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి, ఎఎన్ఎంలు మల్లేశ్వరమ్మ, రెబెకా, ఆశాలు పాల్గొన్నారు.

టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

వేమన పద్యాల భావాలను వివరిస్తున్న జింకా సుబ్రహ్మణ్యం

సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు బాల బాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు క్యారం బోర్డు, చెస్, గణిత బోధనా తరగతులను నిర్వహించారు. గణిత ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి అంకెలు, సంఖ్యలు స్థానిక విలువలు, విస్తరణ రూపం, భిన్నాల పరిచయం గూర్చి తెలిపారు. పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింక సుబ్రహ్మణ్యం విద్యార్థులకు వేమన పద్యాలు, వాటి భావాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్యారం బోర్డు, చెస్ ఆటలకు సంబంధించిన తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, రవిబాబు, రెహమాన్ ఖాన్, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు : విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి సూచించారు. గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి శిబిరాలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. శిబిరానికి విద్యార్థులు ప్రతి రోజూ తప్ప కుండా హజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులకు అన్నిరంగాల్లో వరుస క్రమంలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. ముఖ్యంగా డ్రాయింగ్, పెయింటింగ్, కథలు, సంగీతం వంటి అంశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కొండాపురం : కొండాపురం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అధికారి వరలక్ష్మి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కార్యదర్శి అమీరుద్దీన్ విచ్చేశారు. వేసవి శిక్షణ శిబిరంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఆటలు, బొమ్మల గీయడం, పద్యాలు చెప్పించడం, కథలు చెప్పించడం, పేపర్ క్రాఫ్ట్, ఇంగ్లిష్ గ్రామర్ నేర్పించనున్నారు.

ముద్దనూరు : గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపును గురువారం జిల్లా కార్యదర్శి సందర్శించారు. పాఠకులకు, పిల్లలకు గ్రంథాలయం ప్రాముఖ్యత గురించి వివరించారు. సమ్మర్ క్యాంప్ జూన్ 7వరకు జరుగుతుందని గ్రంథాలయ అధికారి రాజశేఖర్ తెలిపారు.

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో వివేకానంద విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో శ్రీ వివేకానంద పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో 1872 ర్యాంకు సాధించిన విద్యార్థి హమేర అంజుమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంక్ సాధించిన విద్యార్థికి కర్నూలు జిల్లాలో బనవాసి రెసిడెన్షియల్ కళాశాలలో అడ్మిషన్ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జాఫర్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - మైదుకూరు

ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ ఎపి మస్తాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్ట్‌పోల్ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఎవరైనా గొడవలు, ఘర్షణలకు పాల్పడితే అటెంట్ మర్డర్ వంటి నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల అనుచరులు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని సిఐ కోరారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన ఈత సరదా..

ప్రజాశక్తి - వల్లూరు

సరదాగా స్నేహితులతో ఆదినిమ్మాయిపల్లి డ్యామ్‌లో ఈత కొట్టడానికి వచ్చిన మోహన్ సాయి (25) ప్రమాదవశాత్తూ గురువారం మృతి చెందాడు. కడప బికెఎం స్ట్రీట్‌కు చెందిన మోహన్ సాయి స్నేహితులతో కమలాపురం ప్రాజెక్టు వర్క్ కోసం వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో సరదాగా గడపడానికి ఆదినిమ్మాయిపల్లి డ్యాంకు చేరుకున్నారు. అక్కడ నీట మునిగి మృతి చెందాడు. మోహన్ సాయి కడప నగరంలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. డ్యామ్ వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను నిర్మూలించవచ్చని స్థానికులు సూచిస్తున్నారు. సంబంధించిన అధికారులు స్పందించి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కరుతున్నారు.

మృతదేహం వద్ద రోధిస్తున్న తండ్రి కల్యాణ్

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.A.No. 111/2022
E.P.No. 52/ 2019
O.S.No. 198/2018

జోగిరెడ్డి ఈశ్వరరెడ్డి, తండ్రి నారపురెడ్డి, హిందూ, వయస్సు 67 సం॥లు, వ్యవసాయం, డి.నెం.7426-2-3, సరస్వతి విద్యా మందిర్ రోడ్డు, వై.యం.ఆర్.కాలనీ, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, వై.యస్.ఆర్.కడప జిల్లా.

...పిటీషనరు/క్లయిమెంటు

Vs

1. కొండా వేణుగోపాల్ రెడ్డి, తండ్రి ముక్కాల్ రెడ్డి, వయస్సు 51 సం॥లు, హిందూ, వ్యాపారం, డి.నెం.3/995, నియర్ సత్యనారాయణ స్వామి టెంపుల్, వై.యం.ఆర్.కాలనీ, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా.
2. బచ్చు సూర్య నాగిరెడ్డి, తండ్రి నాగిరెడ్డి, వయస్సు 51 సం॥లు, హిందూ, వ్యాపారం, డి.నెం.1/361-5, బొల్లవరం, ప్రొద్దుటూరు టౌన్,కడప జిల్లా, ప్రస్తుతం డి.నెం.4/181, నెహ్రూ రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, వై.యస్.ఆర్ కడప జిల్లా.

...రెస్పాండెంట్స్/డి.హెచ్.ఆర్ & జె.డి.ఆర్

రెస్పాండెంట్ నెం.2/జె.డి.ఆర్.కు నోటీసు

పై నెంబరు పిటిషనులో పిటిషనరు/క్లయిమెంటు ఇ.పి.షెడ్యూలు దాఖలా ఆస్థి జప్తును రద్దుపరచుటకు నీపైన మరియు డి.హెచ్.ఆర్. అయిన కొండా వేణుగోపాల్ రెడ్డి పైన దాఖలు చేసి వున్నాడు. అట్టి పిటిషను 08.07.2024వ తేది నాడు వాయిదా ఉంటున్నది. పై పిటిషనులో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 08.07.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు యందు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట నీ పరోక్షమున తీర్మాణించబడును.

SCHEDULE

House situated in YSR District, Proddatur Registration District, Proddatur Sub District, Proddatur Mandal, Chowtapally Panchayat, Bollavaram Village fields, Door No.1/360-5 of RCC mahadi and site in survey No.581 Pyki Ac.0.05 cents of site and house.
East : Road
West : Site of Subbarao
North : Site of Kandula Lokesh Reddy
South : Road
within these boundaries East-West: 126 links, North-South : 40 links, total an extent of Ac.0.05 cents of site and house with mahadi, with all easementary rights. (The J.Dr is having half share in the E.P. schedule property)

వాయిదా తేది: 08.07.2024

బి.రాంప్రసాద్ రెడ్డి
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

గ్రామాల్లో పెరిగిన పోలింగ్ శాతం

ప్రజాశక్తి - చాపాడు

పోలింగ్ రోజు బారులుదీరిన మహిళా ఓటర్లు

2024 సార్వత్రిక ఎన్నికల్లో గత ఎన్నికల కంటే గ్రామాల్లో పోలింగ్ శాతం పెరిగింది. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా 85.3శాతం పోలింగ్ నమోదైంది. మైదుకూరు నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో అత్యధికంగా పోలింగ్ నమోదైన గ్రామాలను పరిశీలిస్తే.. **చాపాడు** మండలంలోని 39 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 13 పోలింగ్ స్టేషన్లలో 90 శాతం కన్నా అధికంగా పోలింగ్ జరిగింది. అత్యధికంగా నెర్రవాడ గ్రామంలో 94.3, ఓబుల్‌రెడ్డిపేటలో 93, మొర్రాయపల్లిలో 92.5, లక్ష్మీపేటలో 92.4, కేతవరంలో 91.9, కుచ్చుపాపలో 91.7, భద్రిపల్లిలో 91.4శాతం ఓటింగ్ నమోదైంది. 24 గ్రామాల్లో 80శాతానికిపైగా పోలింగ్ నమోదు కాగా.. రెండు గ్రామాల్లో 80 శాతం కంటే తక్కువ పోలింగ్ నమోదైంది. **దువ్వూరు** మండలంలో 55 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో 40,822 మంది ఓటర్లు ఉండగా, 35,793 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొని 87.7శాతం పోలింగ్ జరిగింది. 55 గ్రామాల్లో దాసరిపల్లి అత్యధికంగా 96.3శాతం పోలింగ్ నమోదైంది. 24 గ్రామాల్లో 90శాతానికిపైగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 19 గ్రామాల్లో 80శాతం నుంచి 90 శాతం పోలింగ్ నమోదు కాగా, మిగిలిన గ్రామాల్లో 80 శాతం కంటే తక్కువ పోలింగ్ జరినట్లు అధికారులు తెలిపారు. **బ్రహ్మంగారిమఠం** మండలంలోని 42 పోలింగ్‌స్టేషన్లలో 31,619 మంది ఓటర్లలో 25,775 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొని 81.5శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా జడ్.కొత్తపల్లి పోలింగ్‌స్టేషన్లో 95.6శాతం పోలింగ్ నమోదుకాగా.. కొత్తపల్లిలో 93, మల్లేపల్లిలో 91.3శాతం పోలింగ్ జరిగింది. 24 గ్రామాల్లో 80 నుంచి 90శాతం పోలింగ్ నమోదుకాగా.. మిగిలిన గ్రామాల్లో 80శాతం కన్నా తక్కువ పోలింగ్ జరిగినట్లు అధికారులు వివరించారు. **ఖాజీపేట** మండలంలోని 54 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో 42,650 ఓటర్లలో 34,914 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 82.1శాతం పోలింగ్ నమోదు కాగా.. దుంపలగట్టులో అత్యధికంగా 92.5శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. బుడ్డాయిపల్లిలో 92, నాగసానిపల్లిలో 90.3శాతం ఓటింగ్ నమోదైంది. 34 గ్రామాల్లో 80 నుంచి 90శాతం పోలింగ్ జరగగా.. మిగిలిన గ్రామాల్లో 80శాతం కన్నా తక్కువ పోలింగ్ నమోదైంది. **మైదుకూరు** మున్సిపాలిటీ, మండల పరిధిలో 79 పోలింగ్‌స్టేషన్లలో 64,323 మంది ఓటర్లు ఉండగా, 54,621 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 86.3శాతం పోలింగ్ నమోదైంది. ప్రకాష్ నగర్‌లో అత్యధికంగా 98.1శాతం నమోదు కాగా.. గడ్డమాయిపల్లిలో 96.7, ఉప్పుగుంటపల్లి ఎస్సీ కాలనీలో 96.3శాతం పోలింగ్ నమోదైంది. 31 గ్రామాల్లో 90శాతం కన్నా అత్యధికంగా పోలింగ్ జరగగా.. మిగిలిన గ్రామాల్లో 90శాతం కన్నా తక్కువగా ఓట్లు పోలయ్యాయి.

19న లాసెట్‌పై అవగాహన : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇంటర్మీడియట్, డిగ్రీ తరువాత లా చేయాలనే విద్యార్థులకు ఈ నెల 19న ఒకరోజుపాటు లాసెట్‌పై అవగాహన తరగతులు ఉచితంగా నిర్వహించనున్నట్లు జనవిజ్ఞానవేదిక (జెవివి)అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వి.వి.శివారెడ్డి, సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జెవివి కార్యాలయంలో ఉదయం 9.00 గంటలకు తరగతులు ప్రారంభిస్తామన్నారు. హాజరు కావాలనుకునే వారు 97054,32038ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఈ రోడ్డుకు మోక్షం లేదా!

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని రోటరీపురంలో ఉన్న కొన్ని కాలనీల్లో భూగర్భ అండర్ డ్రయినేజీ కోసం రోడ్లు తవ్వారు. భూగర్భ పనులు పూర్తయి ఏళు గడుస్తున్నా సిసి రోడ్డు వేయ్యలేదు. అక్కడ నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం వస్తే వారికి మరీ ఇబ్బందులు తప్పడంలేదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కాలనీ వాసులు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు చెప్పినా ఇంతవరకు రోడ్డు వేయలేదని వాపోతున్నారు. ముఖ్యంగా ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఉందని. పిల్లలు వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. అంతేకాక చుట్టుపక్కల డ్రయినేజీ నీరు పోకుండా కాలువలపై వెళుతుండడంతో భరించలేని దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ రోడ్డును వెంటనే వేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గుంతలు తవ్వి వదిలేసిన రోడ్డు